**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**జాతీయ వార్తలు**

తేదీ: 20-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

**ముఖ్యాంశాలు**

- ఆరోగ్య సంరక్షణ రంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే ప్రయత్నం జరుగుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- అకాల వర్షాల వల్ల సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు సహాయం చేస్తామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- దేశంలో ఎల్పీజీ నిల్వలు తగినంత అందుబాటులో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.
- పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందం పునరుద్ధరించే ప్రసక్తి లేదని భారత్ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి నిరంతర ప్రయత్నం జరుగుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందేలా చూడటానికి ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు దోహదపడుతున్నాయని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌లో ఉన్న రామకృష్ణ మిషన్ సేవాశ్రమ ఆసుపత్రిలో నంద్ కిషోర్ సోమాని ఆంకాలజీ బ్లాక్‌ను రాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాన్సర్ చికిత్సను కూడా ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి తీసుకురావడంతో పేదలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతోందని అన్నారు. అదే విధంగా సేవా స్ఫూర్తితో నడిచే వైద్య సంస్థలు సమాజంలో గొప్ప పాత్ర పోషిస్తాయని రాష్ట్రపతి తెలియజేస్తూ...

(వాయిస్…32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం, మారిషస్ ల మధ్య ఇంధన భద్రత, సామర్థ్యం, సమ్మిళిత అభివృద్ధి అంశాలపై కూడా ఇరు పక్షాలు ప్రత్యేక దృష్టి సారించాయని కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 'భారత్ విద్యుత్ సదస్సు' సందర్భంగా, మారిషస్ ఇంధన ప్రజా వినియోగాల శాఖా మంత్రి పాట్రిక్ గెర్వైస్ అస్సిర్వాడెన్‌ను కేంద్ర మంత్రి ఈరోజు కలిశారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ గ్రిడ్ నిర్వహణ రంగాలలో సహకారాన్ని విస్తరించడంపై తాము చర్చించినట్లు కేంద్ర మంత్రి సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

తగినంత ముడి చమురు నిల్వలతో అన్ని రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి స్థిరంగా ఉందని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. పశ్చిమ ఆసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ, గత వారంలో వినియోగదారులకు 11,300 టన్నుల వాణిజ్య ఎల్పీజీని సరఫరా చేసినట్లు తెలిపారు. దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, రిటైల్ అవుట్‌లెట్లలో నిల్వల కొరత లేదని ఆమె పేర్కొంటూ...

(వాయిస్…27 సెకన్లు)

ఈ సమావేశంలో ఓడరేవులు, నౌకాయానం జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని నిలిపివేసేంతవరకూ పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందం కొనసాగించే ప్రసక్తి లేదని భారత్ పునరుద్ఘాటించింది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీష్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పాకిస్థాన్‌ను ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా అభివర్ణించారు. భారత్ మంచి ఉద్దేశ్యంతో 1960 నాటి సమయంలో సింధు జలాల ఒప్పందంపై సంతకం చేసిందని ఆయన గుర్తు చేశారు. కాని పాకిస్థాన్ ఉగ్రవాద దాడులను ప్రోత్సహించడం ద్వారా ఒప్పంద స్ఫూర్తిని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. ఇదిలా ఉండగా, గత ఏడాది జమ్మూ కాశ్మీర్ లో జరిగిన పహల్గామ్ దాడి తర్వాత భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఈద్-ఉల్-ఫితర్ పండుగ సందర్భంగా ముస్లిం సమాజానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రమైన ఈద్-ఉల్-ఫితర్ పండుగ సందర్భంగా దేశంలో విదేశాలలో నివసిస్తున్న ముస్లిం సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం ముగిసిన తర్వాత జరుపుకునే ఈ పండుగ, ఆత్మనిగ్రహం, దానధర్మాలు, నిరుపేదల పట్ల కరుణ అనే సందేశాన్ని ఇస్తుందని గుర్తు చేశారు. ప్రేమ, సోదరభావం, శాంతి పరస్పర సామరస్యం యొక్క సందేశాన్ని కూడా ఈ పండుగ తెలియజేస్తుందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

కామెరూన్‌లోని యౌండేలో ఈ నెల 26 నుండి 29 వరకు జరుగనున్న ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 14వ మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యే భారత ప్రతినిధి బృందానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ నాయకత్వం వహించనున్నారు. ప్రపంచ వాణిజ్యాన్ని ప్రోత్సహించడంలో డబ్ల్యూటీఓ కీలక పాత్ర పోషించేలా చూడడం, డబ్ల్యూటీఓ ని మరింత బలోపేతం చేయడానికి ఈ మంత్రివర్గ సమావేశంలో భారత్ కృషి చేస్తుందని వాణిజ్య మంత్రిత్వ శాఖలోని అధికారిక వర్గాలు తెలిపాయి. ఇ-కామర్స్ లావాదేవీలపై 28 ఏళ్ల నిషేధాన్ని కొనసాగించడం, మత్స్య పరిశ్రమకు రాయితీలు, అభివృద్ధి కోసం పెట్టుబడుల సౌకర్య ఒప్పందం ప్రతిపాదన వంటి ఇతర అంశాలను కూడా భారత్ ఈ సందర్భంగా ప్రస్తావించనుంది. అమెరికా విధించిన వాణిజ్య సుంకాలపై కూడా డబ్ల్యూటీఓ సభ్య దేశాలు చర్చలు చేపట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = =

అకాల వర్షాల వల్ల దేశంలోని పలు రాష్ట్రాలలో సంభవించిన పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి రైతులకు సకాలంలో సహాయం చేస్తామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ, రైతులకు బీమా క్లెయిమ్‌లను సక్రమంగా పరిష్కరించడం మీద ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న నష్టాలపై పరిశీలన చేస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ…

(వాయిస్…32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

మెరుగైన నోటి పరిశుభ్రత అలవాట్లను అలవరచుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జె.పి. నడ్డా ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్ట్‌లో దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి సరిగ్గా బ్రష్ చేయడం, చక్కెర పదార్థాలను పరిమితం చేయడం, క్రమం తప్పకుండా దంత వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి సాధారణ పద్ధతులని పాటించాలని ఆయన

పేర్కొన్నారు. దంతాల సంరక్షణ మీద అవగాహన పెంచుకోవాలని, ప్రతిరోజూ మంచి నోటి పరిశుభ్రతను పాటించేందుకు కట్టుబడి ఉండాలని ప్రజలను కేంద్ర మంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రేపటి నుండి రెండు రోజుల పాటు మహారాష్ట్రలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నాగపూర్‌లోని మహర్షి వ్యాస్ ఆడిటోరియంలో రేపు జరిగే 'ఇండియన్ యూత్ పార్లమెంట్' 29వ జాతీయ సమావేశ ప్రారంభోత్సవానికి ఉపరాష్ట్రపతి హాజరవుతారు. రేపు సాయంత్రం ముంబైలోని లోక్ భవన్‌లో జరిగే 'రతన్ టాటా మహారాష్ట్ర రాష్ట్ర నైపుణ్య విశ్వవిద్యాలయం' మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే 64వ 'జైన దీక్షా మహోత్సవం' వేడుకలకు కూడా హాజరవుతారు. ఎల్లుండి మహారాష్ట్రలోని పుణే సమీపంలో ఉన్న ఉరులి కాంచన్‌లో గల 'నిసర్గోపచార్ ఆశ్రమం' వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ముఖ్య అతిధిగా హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ రహదారుల కార్యకలాపాల నిర్వహణ కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డాష్ క్యామ్ పర్యవేక్షణ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర రోడ్డు, రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ తెలియజేసింది. భారత జాతీయ రహదారుల అథారిటీ (NHAI) సుమారు 40 వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల నెట్‌వర్క్‌లో కార్యకలాపాలు నిర్వహణ కోసం కృత్రిమ మేధని వినియోగించుకోనుంది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు ఎక్స్‌ప్రెస్‌వేల నిర్వహణ కోసం ఏఐ మెషిన్ లెర్నింగ్ లను ఉపయోగించుకుంటుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =